

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం 8లో..
మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు 8లో..

కుందనపల్లిని కమ్మేస్తున్న ఎన్టీపీసీ బూడిద

- బావులు, చెరువుల్లో కలుషితమవుతున్న నీరు
- అనారోగ్యం బారిన పడుతున్న గ్రామస్థులు
- సాగుకు నోచుకోని వ్యవసాయ భూములు



కుందనపల్లి గ్రామాన్ని కమ్మేస్తున్న ఎన్టీపీసీ బూడిద(ఫైల్)

అంతర్గాం, మే 19: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామాన్ని ఎన్టీపీసీ యాష్‌పాండ్ బూడిద కమ్మేస్తోంది. ప్లాంటు నిర్మాణ సమయంలో గ్రామానికి చెందిన రైతుల నుంచి వందలాది ఎకరాల పంట పొలాలు సేకరించిన ఎన్టీపీసీ గ్రామానికి అతి సమీపంలో యాష్ పాండ్‌లను నిర్మించింది. దీంతో ఈదురు గాలులకు యాష్‌పాండ్ బూడిద పైకి లేచి గ్రామాన్ని కమ్మేస్తుండడంతో బావుల్లోని నీరు కలుషితం అవుతోంది. బూడిద రవాణాతో గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారు. 25 సంవత్సరాలుగా గ్రామస్థులు బూడిద కారణంగా సతమతమవుతున్నా ఎన్టీపీసీ యాజమాన్యం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్టీపీసీ బూడిద పాండ్‌లో బూడిద లేవకుండా ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్లతో యాష్‌పాండ్‌లో నీరు కొట్టించకపోవడం కారణంగా ఎండిన బూడిద గ్రామాన్ని కమ్మేస్తోంది. స్ప్రింక్లర్ కార్మికులను ఇతర సివిల్ పనులకు వాడుకుంటున్న ఎన్టీపీసీ యాజమాన్యం బూడిద నివారణ చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది.

● సాగుకు నోచుకోని పంట పొలాలు

ఎన్టీపీసీ బూడిద నీరు కారణంగా పంట పొలాల్లో తుంగ మొలిచి సాగుకు నోచుకోవడం లేదు. ఎన్టీపీసీ సేక రించిన వందలాది ఎకరాలు పోను మిగిలిన కొద్దిపాటి భూములు సాగుకు నోచుకోక పోవడంతో గ్రామస్థులు కూలీలుగా మిగిలిపోయారు. భూముల సేకరణ సమ యంలో నిర్వాసితులందరికి ఉద్యోగాలు కల్పిస్తామన్న యాజ మాన్యం కొంత మందికే ఉపాధి కల్పించి చేతులు దులుపుకుంది.

● యాష్‌పాండ్‌లో నీరు చల్లించని ఎన్టీపీసీ

యాష్‌పాండ్ నుంచి బూడిద లేవకుండా ఉండేందుకు ఎన్టీపీసీ రెండు బ్యాచ్‌లను ఏర్పాటు చేసింది. అయితే సదరు కార్మికులతో నీరు చల్లించకపోవడంతో ఎండిన బూడిద పైకి లేచి గ్రామాన్ని మొత్తం బూడిదమయం చేస్తోంది. నిత్యం స్ప్రింక్లింగ్ చేయించి బూడిద లేవకుండా చర్యలు తీసుకోవాలనిగ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

● నిర్లక్ష్యం వీడని ఎన్టీపీసీ

ఎన్టీపీసీ యాష్‌పాండ్ కారణంగా అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్థులు నిరాహార దీక్షలు, ఆందోళనలు చేసినా ఇప్పటివరకు యాజమాన్యం నిర్లక్ష్యం వీడడం లేదు. మరోవైపుగ్రామంలో రహదారులు పూర్తిగా శిథిలమై నడవలేని పరిస్థితి నెలకొన్నది. తాగునీరు సరఫరా చేసినప్పటికీ అన్ని ప్రాంతాలకు అందడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

● పునరావాసం కల్పించాలని ఆందోళనలు..

గ్రామానికి అతి సమీపంలో యాష్‌పాండ్‌లు ఉండడంతో నిత్యం కాలుష్యం కోరల్లో జీవిస్తున్న తమకు పునారవాసం కల్పించి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తలరించాలని కుందనపల్లి గ్రామస్థులు వంద రోజుల పాటు నిరాహార దీక్షలను కొనసాగించారు. ఆ సమయంలో స్థానిక అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గ్రామస్థులతో కలిసి పాదయాత్రగా పెద్దపల్లి కలెక్టరేట్ వరకు వెళ్లి కుందనపల్లి వాసుల సమస్యలను అప్పటి కలెక్టర్ సంగీతసత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లినప్ప టికీ సమస్య పరిష్కారం కాలేదు.

బావుల నీరు పూర్తిగా కలుషితం అయ్యాయి..



- ఎండీ సిరాజుద్దీన్, కుందనపల్లి

ఎన్టీపీసీ బూడిద కారణంగా గ్రామంలోని బావుల నీరు పూర్తిగా కలుషితం అయ్యాయి. ప్రతి యేటా వేసవిలో ఈదురు గాలులకు బూడిద గ్రామాన్ని కమ్మేయడంతో అనారోగ్యాలకు గురవుతున్నాము. ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించి బూడిద లేవకుండా చర్యలు చేపట్టాలి.

భూములు సాగుకు నోచుకోవడం లేదు..



- మేకల బాపు, కుందనపల్లి

ఎన్టీపీసీ సేకరించిన భూములు పోగా మిగలిన కొద్దిపాటి భూముల్లో తుంగమొలిచి సాగుకు నోచుకోవడం లేదు. ఎన్టీపీసీ యాజమాన్యం మా భూముల్లో మొలిచిన తుంగను తొలగించేందుకు చొరవ చూపాలి. మా భూములు సాగుకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్

- విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా

- అక్రమార్కులపై పీడీ యాక్టు : సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మే 19: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు రామగుండంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ, కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు సరఫరా చేసేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాయని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా యన్నారు. ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు, కొన్ని కంపెనీలు కాలంచెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం, తీరా వాటితో సరైన దిగుబడి రాక రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతున్నారన్నారు. రైతులు నకిలీ, కల్తీ విత్తన ముఠాల బారిన పడకుండా మేలు రకం విత్తనాలు విక్రయించే విధంగా నకిలీ, కల్తీ విత్తనాలు స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై కఠినంగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోగల విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం, రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాల జారీ చేశామని వివరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు, ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ద్వారా నిఘా ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడం, మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు నకిలీ, కల్తీ విత్తనాల అక్రమ రవాణాను, సరఫరా నిరోధించేందుకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్ఠం చేయడం జరిగిందని, నకిలీ విత్తన అక్రమార్కులపై పీడియాక్ట్ అమలుకు జాబితా కూడా సిద్ధం చేస్తామని సీపీ పేర్కొన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఐ కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

కళ్యాణ్‌నగర్, మే 19: ఆదివాసీలపై బీజేపీ దాడులను ఆపాలని, ఆదివాసీల హత్యలపై సిట్టింగ్ జడ్జిలతో విచారణ జరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన ఆయన మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతల దోపిడీకి కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని, 16రాష్ట్రాల్లో విలువైన ఖనిజ సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పగించిందని, ఆదివాసులను, గిరిజనులను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకే మోదీ, అమిత్‌షా పని చేస్తున్నారని చెప్పారు. ఐదు నెలలుగా ఆపరేషన్ కంగారు పేరుతో చత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలో 120మందికిపైగా గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. 2024లో దేశంలో మావోయిస్టు పార్టీ, విప్లవ సంస్థలు లేకుండా చేస్తామని నరేంద్ర మోదీ కంకణం కట్టుకున్నారని, విప్లవ సంస్థలను నిషేధించి అర్బన్ నక్సలైట్ల పేరుతో ఎన్‌ఐఎ, ఉప కేసులను పెట్టి జైలుకు పంపుతుందని, పాలకవర్గాలు విప్లవ సంస్థలను, వారు చేస్తున్న కార్యక్రమాలను శాంతిభద్రతల సమస్యలుగా చూపడం సరైందికాదని ఆరోపించారు. నిర్బంధపు, బూటకపు ఎన్‌కౌంటర్లు, హత్యలు చేయడం దుర్మార్గమని, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఈదునూరి నరేష్, వెంకన్న,అశోక్, చిలుక శంకర్, లింగమూర్తి, దుర్గయ్య, రవి కుమార్, ఎల్లయ్య, బుచ్చయ్య, రాజేశం, రాజేందర్, రమేష్, మల్లేషం పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



రైటప్: సామూహిక బోనాలతో వస్తున్న భక్తులు

మంథనిరూరల్, మే 19: మండలంలోని చిల్లపల్లి గ్రామంలోని శ్రీబీరప్పస్వామి మహంకాలమ్మ దేవాలయంలో శ్రీబీరప్పస్వామి, కామరాతి కల్యాణ మహోత్సవాలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. పదిరోజులు పాటు ఉత్సవాలు నిర్వహించడానికి ఘనంగా ఏర్పాట్లను చేశారు. ఆదివారం గ్రామస్తులంతా బోనాలతో ఊరేగింపుగా వచ్చి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి పది రోజుల పాటు జరిగే పండుగ కావడం, రోజుకొక కార్యక్రమం ఉండడంతో గ్రామంలో సందడి నెలకొంది.

పరిహారం కోసం మామిడి రైతుల పడిగాపులు

ఓదెల, మే 19 : ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన మామిడి రైతులు పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారు. ఎనిమిది రోజుల క్రితం మండలంలో కురిసిన అకాలవర్షం, గాలి దుమారానికి మండల కేంద్రంతోపాటు మడక, పిట్టల ఎల్లయ్యపల్లి, గుండ్లపల్లి, గూడెం, గుంపులలోని మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎకరం మామిడి తోటకు రూ.50వేల చొప్పున యజమానులకు డిపాజిట్లు చెల్లించి, దాదాపు 67 ఎకరాల మేరకు రైతులు మామిడి తోటలను లీజుకు తీసుకున్నారు. చెట్లు ఎదిగి కాత, పిందెలతో మామిడి తోటలు కళకళలాడాయి. అనంతరం కౌలుకు తీసుకున్న రైతులు తోటల్లోనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని, తోటలను కాపాడుకున్నారు. దీంతో చెట్టు నిండా మామిడికాయలతో తోటలు ఎంతో ఆశాజనకంగా ఉండగా, ఇంతలోనే అతివేగంతో గాలి ఉధృతి, అకాలవర్షం వల్ల కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడికాయలు, పిందెలు, సైతం నేలరాలిపోయాయి. దీంతో కనీసం విక్రయించుకునేందుకు వీలులేకుండా కాయలు పగిలిపోయాయి. వేలాది రూపాయలు తోటలకు ఖర్చుచేయగా కనీసం పెట్టుబడులు కూడా మిగలలేని దుస్థితి రైతులకు నెలకొంది. ఇక తోటలను లీజుకి ఇచ్చిన యాజమానులకు ముందుగా ఒప్పందం చేసుకున్న ప్రకారం డబ్బులు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో రైతులను ఆదరించకపోవడం వల్ల రైతులు వేలాది రూపాయలను కోల్పోయి నష్టపోయారు. ప్రస్తుతం నష్టపోయిన మామిడి తోటలకైనా నష్టపరిహారం అందుతుందా? లేదా? అనే ఆందోళనలో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు యుద్ధ ప్రాతిపదికన సర్వేలు నష్టపరిహారాన్ని అందించేవారని, అదే విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో పెట్రోల్ కల్తీ

- బంకుల్లో వెలుగుచూస్తున్న ఘటనలు - తూకంలోనూ మోసాలు.. పట్టించుకోని అధికారులు

- వినియోగదారులకు అందని సేవలు

కళ్యాణ్‌నగర్, మే 19: ఇటీవల కాలంలో ఏ వస్తువును చూసినా కల్తీమయం అవుతున్నది. చివరికి పెట్రోల్, డీజిల్‌లో కూడా కల్తీ చేస్తుండడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 20వరకు పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. వేలాది లీటర్ల పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుగుతుంటాయి. కొన్ని బంకుల్లో ఇటీవల కాలంలో పెట్రోల్, డీజిల్‌లో నీళ్ల కలవడంతో వాటిని వినియోగించిన వాహనాలు చెడిపోతున్నాయి. దీంతో వేలకువేలు వాహనాల రిపేర్లకు వెచ్చిస్తున్నారు. వారంరోజుల క్రితం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఉన్న ఓ బంక్‌లో పెట్రోల్‌లో నీళ్ల రావడంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు.పెట్రోల్ పోయించుకున్న వాహనదారులు కొద్దిదూరం వెళ్లగానే వాహనాలు నిలిచిపోవడంతో బంక్ వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ బంక్‌లో డీజిల్‌లో నీళ్ల రావడంతో ఆటోడ్రైవర్లు బంక్ ఎదుట ఆందోళనకు దిగారు. నిత్యం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇదే తంతు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అండర్‌గ్రౌండ్‌లో ఉన్న ట్యాంకులను రోజూ పరిశీలించి బంక్ ప్రారంభించే సమయంలో శాంపిల్స్ సేకరించాల్సి ఉండగా బంక్ యజమానులు అలా చేయకపోవడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. 24గంటల ఇంధన సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటిస్తున్న బంక్‌లు రాత్రి 11గంటలకు మూసి వేస్తున్నారు. దీంతో రాత్రిపూట ప్రయాణించే వాహనదారులు ఈ ప్రాంతంలో ఇంధనం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లీటరు పెట్రోల్ పోయిస్తే.. వచ్చేది అరలీటరే..

చాలా బంక్‌ల్లో రీడింగ్‌ల్లో సెట్టింగ్‌లు చేసి వినియోగదారులను మోసం చేస్తున్నారనే ప్రచారం భారీగా ఉన్నది. బంక్ మిషన్లలో రీడింగ్‌లో ట్యాంపర్‌కు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చాలా మంది వాహనదారులు ఈ మోసాల బారిన పడినట్టు పేర్కొంటున్నారు. కేవలం బాటిళ్లలో తీసుకున్న సమయంలోనే సరైన కొలతలతో పెట్రోల్ పోస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఇలా కొన్ని బంకుల్లో లీటరు పెట్రోల్ పోయిస్తే అరలీటరు మాత్రమే వస్తోంది. పెట్రోల్ బంక్‌ల్లో నిత్యం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు లేకపోవడంతో బంక్‌ల నిర్వాహకులు ఆడింది ఆటగా సాగుతున్నది. రామగుండం పారిశ్రామికప్రాంతంలో ఏ రోజు కూడా బంక్‌లను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నీళ్లతో కల్తీ అయిన పెట్రోల్

అందని సేవలు..

ప్రతి పెట్రల్ బంక్‌లో వినియోగదారులకు సేవలందించాల్సి ఉండగా ఏ బంక్‌లో సేవలు లభించడం లేదు. తాగునీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఫస్ట్‌ఎయిడ్ కిట్, ఎయిర్ సౌకర్యం కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఏదైనా ఆపద వస్తే వినియోగదారుడు ఫోన్ చేసే సౌకర్యం ప్రతి బంక్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా ఫోన్లను ఏర్పాటు చేయడంలేదు. వినియోగదారులు పెట్రోల్, డీజిల్ నాణ్యత తెలుసుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి కూడా అందుబాటులో ఉంచడం లేదు. ఎవరైనా వినియోగదారులు ప్రశ్నిస్తే వారిపైన బంక్ సిబ్బంది దాడులకు తెగబడుతున్నారు. దీనిపై పలు ఆయిల్ కంపెనీలు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆయిల్ కంపెనీలు ప్రతి బంక్‌లో వినియోగదారులకు అందించాల్సిన సేవలను సైన్‌బోర్డులో ప్రకటించాల్సి ఉండగా బోర్డులే ఉండడం లేదు. ఇప్పటికైనా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బంక్‌ల్లో కల్తీని అరికట్టి తూనికలపై నిఘా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టండి

పెద్దపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బందంపల్లి చెరువు సర్వే నంబర్ 262, తాళ్ల కుంట సర్వే నంబర్ 31లో భూమి అన్యాక్రాంతం అవుతుందని వెంటనే పరిశీలించి చర్యలు చేపట్టాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడె జాపతి రాజేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. బందంపల్లి చెరువు సర్వే నంబర్ 262లో 65 ఎకరాలు, తాళ్లకుంట సర్వే నెంబర్ 31లో 9 ఎకరాల 19 గుంటల భూమి ఉందని కొంతమంది చెరువు శిఖం భూమిని అక్రమించుకొని చెరువును నామరూపాలు లేకుండా చేస్తున్నారని వెంటనే అట్టి భూములను సర్వే నిర్వహించిన హద్దులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వినతిలో రాజేష్ కోరారు.

కార్యవర్గం

పెద్దపల్లిటౌన్, మే 19: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ ఎస్టీ, ఎస్సీ, నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నూతన కార్యర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జే సారంగ పాణి, గౌరవ అధ్యక్షుడిగా ఏ రాజమౌళి, సెక్రెటరీగా ఏం దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షులుగా అబ్దుల్ కరేసి, నరేష్, కోశాధికారిగా ఆర్ రమేష్, సంయుక్త కార్యదర్శి జి రాజశేఖర్, జిల్లా సహాయకార్యదర్శిగా కే శంకరయ ప్రచార కార్యదర్శిగా ఈ రాజకుమార్, ఆఫీస్ కార్యదర్శిగా, జి రమేష్, ఈసీ మెంబర్‌లుగా జి భువనేశ్వరి. జి స్వరూప, ఎం ప్రభాకర్, ఎం ప్రేమ్‌సాగర్, కే స్వామి, తహర్‌ఖాన్‌లను నియమించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలు

ఎలిగేడు, మే 19 : మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లికి చెందిన బొడిగే కొంరయ్య గౌడ్(60) అనే గీతకార్మికుడు తాటిచెట్టుపై నుంచి పడడంతో తలకు, నడుముకు తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



అనిత ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విద్యాభారతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం




ప్రగతి పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోల్‌సిటీటౌన్, మే 19: గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అనిత ఉన్నత పాఠశాలకు 1994-95 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 29 ఏళ్ల క్రితం ఒకే చోట కలిసి చదువుకొని ఉన్నత చదువుల కోసం వెళ్లిపోయి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు దేవానంద్, అశోక్, హరినాథ్ శర్మ రాధాకృష్ణ, 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మార్కండేయ కాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విద్యాభారతి హైస్కూల్ 2008-09 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆడారు...పాడారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అరుకాల రాంచంద్రారెడ్డి-పద్మ దంపతులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని సెంటినరీకాలనీలో ప్రగతి పాఠశాలకు చెందిన 2001-2002 సంవత్సరానికి సంబంధించిన ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతికి చెందిన పూర్వవిద్యార్థులు సమ్మేళనం ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. 23 సంవత్సరాల అనంతరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థుల ఒకరినొకరు కలుసుకొని వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ప్రగతి కరస్పాండెంట్‌లు అబ్బు కేశవరెడ్డి, మిర్యాలరాజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, నాగరాజుకు మారి, నిర్వాహకులు మహేష్, నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, పవిత్ర, సునీత, స్వప్న, అఫ్రోజ్‌ఖాను తదితరులు పాల్గొన్నారు.



ఐదుగురిపై గృహహింస కేసు నమోదు

నెన్నెల, మే 19: అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెలకు చెందిన మౌనిక (హరిత)తో పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగులమల్యాల రాజుతో 2023లో పెళ్లి జరిగింది. కట్నకానుకలు ఇచ్చి వివాహాన్ని ఘనంగా జరిపించారు. వివాహమైన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నారు. అత్త అమ్మాయి, మామ ఆనందం, ఆడపడుచు బ్రహ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు సైతం మౌనికను మానసికంగా వేధించేవారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.









కూతురిని కడతేర్చిన తల్లిదండ్రుల అరెస్ట్

● మానసిక స్థితి బాగాలేదని కూతురికి ఉరివేసి హత్య ● వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 19: కన్నకూతురును కడతేర్చిన తల్లిదండ్రులు కటకటాలపాలైన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో జరిగింది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో కూతురి మానసిక స్థితి బాగాలేదని ఎలాగైనా వదిలించుకోవాలని భావించి ఈ నెల 14న అర్ధరాత్రి ఇంట్లోనే ఉరివేసి హత్యచేశారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు... తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతులకు ప్రియాంక(24) ఏకైక కుమార్తె. ప్రియాంక ఈ నెల 14న మృతి చెందింది. ఆమె మృతిపై గ్రామస్థులకు అనుమానాలు రావడంతో ఆ సమాచారాన్ని తెలుసుకున్న గ్రామ కార్యదర్శి రాజు తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా కన్నకూతురి మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల తల్లిదండ్రులే ఉరివేసి హతమార్చారని తేలింది. కూతురు ప్రియాంక మానసిక వ్యాధితో బాధపడుతూ మృతిచెందినట్లు చిత్రీకరించి భర్తకు సమాచారం అందించి మృతదేహాన్ని ఆమె అత్తవారి గ్రామమైన దర్గపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. ప్రియాంక మృతిపై అనుమానం వెల్లువెత్తడంతో ఆమె తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటన గుట్టురట్టయింది. నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నర్సయ్య దంపతులకు ప్రియాంక ఏకైక కుమార్తె. ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. కుమార్తె ప్రియాంకను తల్లిదం డ్రులు ఆస్పత్రులలో చికిత్స చేయించగా కొంత వ్యాధి నయమైంది. దీంతో ప్రియాంకకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దర్గపల్లి గ్రామానికి చెందిన పృథ్వి అనే వ్యక్తితో 2020లో పెళ్లిచేశారు. వివాహం అనంతరం ప్రియాంక, పృథ్వి దంపతులు జీవనోపాధి కోసం కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో నివాసం ఉన్నారు. వీరికి 13 నెలల కుమారుడు ఉన్నాడు. నెల


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రోజులుగా ప్రియాంక మళ్లీ మానసిక వ్యాధితో బాధపడుతూ అందరిని ఇబ్బంది పెట్టడమే కాకుండా కుమారుడిని కొట్టి కిందపడేయడం చేస్తుందని ఆమె భర్త పృథ్వీ అత్తమామలైన ఎల్లవ్వ, నర్సయ్యలకు చెప్పాడు. దీంతో కూతురు ప్రియాంకను కరీంనగర్ నుంచి నేరెళ్లకు తీసుకువచ్చిన తల్లిదండ్రులు బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం వద్ద వ్యాధి నయం అవుతుందని మూడు రోజులు ఉంచినా ఎంతకీ నయం కాలేదు. విసిగిపోయిన తల్లిదండ్రులు ప్రియాంకను నేరెళ్ల గ్రామానికి తీసుకువచ్చారు. కూతురు మానసిక వ్యాధి నయం కోసం చికిత్స కోసం తిరగడంతో తల్లిదండ్రులకు అప్పులు పెరిగాయి. దీంతో ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలనుకున్న తల్లిదండ్రులు ఈ నెల 14న అర్ధరాత్రి ప్రియాంక ఇంట్లో నిద్రిస్తుండగా నూలు దారంతో ఉరివేసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ చెప్పారు. ఈ మేరకు కన్నకూతురిని హత్యచేసిన తల్లిదండ్రులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ హత్యను గ్రామస్థుల సమాచారం మేరకు ఛేదించామని వివరించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రూరల్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండంలో రూ.4కోట్ల చెక్కులు వాపస్

● 5శాతం ఇస్తే బిల్లులు పాస్ ● ఏడాదిగా ట్రెజరీల చుట్టూ తిరుగుతున్న కార్పొరేషన్ కాంట్రాక్టర్లు

కోల్‌సిటీ, మే 19: రామగుండం నగరపాలక సంస్థలో గత ఏడాది అభివృద్ధి పనులు చేసి చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లకు బిల్లులు పాస్‌కాలేదు. ఏడాది పాటు ట్రెజరీల చుట్టూ తిరిగిన కాంట్రాక్టర్లకు ఆర్థిక సంవత్సరం ముగియడంతో చెక్కుల గడువు ముగిసిందంటూ వాపసు పంపారు. రామగుండం నగరపాలక సంస్థకు చెందిన రూ.4కోట్ల చెక్కులు వాపసు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 14వ ఆర్థిక సంఘం, ఎస్‌సీ సబ్‌ప్లాన్, పట్టణ ప్రగతి, ఏసీడీపీ నిధులకు చెందిన చెక్కులు ఉన్నాయి. ఇందులో కేవలం పట్టణ ప్రగతికి సంబంధించే రూ.3కోట్ల బిల్లులు ఉండగా 14వ ఆర్థిక సంఘంకు సంబంధించి రూ.1కోటి ఉన్నాయి. చివరికి నియోజకవర్గ అభివృద్ధి నిధులకు సంబంధించి ఏసీడీపీ చెక్కులు కూడా పాస్‌కాలేదు. రామగుండంలో రూ.40లక్షల ఏసీడీపీ చెక్కులు కూడా వాపసు వచ్చాయి. రామగుండం నగరపాలక సంస్థలో మే 2023 నుంచి బిల్లులు పాస్‌కావడం లేదు. మే 2023 నుంచి మార్చి 31, 2024వరకు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 143పనులకు సంబంధించి బిల్లులు పాస్‌కాలేదు. ట్రెజరీలో, సంబంధిత హెడ్‌లలో నిధులు లేవనే కారణంగా వీటిని పెండింగ్‌లో పెట్టారు. దీంతో అప్పులు తెచ్చి పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు వాపసు రావడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఏడాది వడ్డీలు మీద పడ్డాయని, ఇంకా జాప్యం జరిగితే పెట్టుబడులు పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు.

● రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించి వివిధ స్కీముల బిల్లులు పాస్ చేయడంలో ఆర్థికశాఖలో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో బిల్లుపై 5శాతం కమీషన్ ఇస్తే బిల్లులు పాస్ చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఒకే స్కీముకు సంబంధించి కొందరి కాంట్రాక్టర్ల బిల్లులు మే, 2023 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అదే స్కీముకు సంబంధించి 2024లో పనులు చేసి మార్చిలో చెక్కులు తీసుకున్న కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పైరవీలు చేయించుకుంటే బిల్లులు పాసయ్యాయని, తమ బిల్లులు మాత్రం పెండింగ్‌లో పెట్టారని ఆరోపిస్తున్నారు.





ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ మృతి

హుజూరాబాద్, మే 19: హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన అల్లి మహేందర్ (58) అనే ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లి మహేందర్‌కు శనివారం రాత్రి ఛాతీలో నొప్పిగా ఉండడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మహేందర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎల్ఐసీ ఏజెంట్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

రూ.300 అపరాధ రుసుముతో పాలిసెట్ దరఖాస్తుకు చివరిరోజు నేడు

కరీంనగర్ టౌన్, మే 19: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-24కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.300 అపరాధ రుసుముతో సోమవారం చివరిరోజని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలి

భగత్‌నగర్, మే 19: జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రమేష్‌లు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయకుండా గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే తమ పిల్లల్ని చదివించాలని ప్రకటించిన డీఈఓ ప్రకటన సరైంది కాదన్నారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై నిరసన

● వడ్ల కుప్పపై డీజిల్‌పోసి నిప్పంటించే యత్నం

జగిత్యాలరూరల్, మే 19: ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుటపేట ఐకేపీ సెంటర్‌లో అదే గ్రామానికి చెందిన అంబటి సందీప్ అనే యువ రైతు తన ధాన్యాన్ని 27 రోజులు గడిచినా అధికారులు తూకం వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తన వడ్ల కుప్పపైన డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న స్థానిక రైతులు రైతును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు సందీప్ మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నాడు. తూకం వేయమంటే ఏదో కారణం చెబుతూ ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదన్నారు. లారీలు, రైస్‌మిల్‌ను రైతులే మాట్లాడుకోవాలని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారన్నారు. ఐకేపీ సెంటర్‌లో కనీస మౌలిక వసతులులేవని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉన్నవారి ధాన్యాన్ని మాత్రమే త్వరగా తూకం వేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇప్పటివరకు సెంటర్‌లో 30 శాతం కొనుగోళ్లు మాత్రమే జరిగాయని, మిగతా 70 శాతం ధాన్యం ఐకేపీ సెంటర్‌లోనే మగ్గుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణం మార్పుల వల్ల వర్షం వచ్చే అవకాశం ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట స్థానిక రైతులు, మహిళలలు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలపై ఆసక్తి చూపని రైతులు

● మండల సమాఖ్యల ఆధ్వర్యంలో కొనుగోళ్లు

● మూలనపడ్డ ట్రాక్టర్, యంత్రాలు

మల్యాల, మే 19: స్వశక్తి మహిళల ఆర్థికాభివృద్ధి, రైతులకు తక్కువ అద్దె ధరలకు వ్యవసాయ యంత్రాలు సమకూర్చడానికి మండల సమా ఖ్యల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్, పరికరాలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వ్యవసాయ యంత్రాలు నిరూపయోగంగా మారాయి. రైతులకు తక్కువ అద్దెపై సాగు చేసుకోవడంకు గాను దున్నడం తదితర వాటి కోసం ట్రాక్టర్, ట్రాలీ , రోటో వేటర్, కల్టివేటర్. వరి నాటు యంత్రాలు తదితరవి జిల్లాలోని 15మండ లాలల్లో గల ఐకేపీ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో గత ఏడాది క్రితం రూ.12.67లక్షల వ్యయంతో కొనుగోలు చేశారు. ఈ యంత్రాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులకు అద్దె ఇవ్వడానికి గాను కొనుగోలు చేయగా వాటి పట్ల రైతులు మక్కువ చూపడం లేదు. అద్దెకు నగదు చెల్లించి తీ సుకెళ్లడం అనాసక్తికి కారణంగా తెలుస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ పను లు చేసిన అనంతరం పంటల దిగుబడి అయ్యాక ట్రాక్టర్ యజమానులకు డబ్బులు చెల్లిస్తుండగా ఇక్కడ మాత్రం ముందు చెల్లింపుల పట్ల రైతులు వీటిని తీసుకెళ్లడం లేదు. మల్యాలలో గల ఈ యంత్రాలను మ్యాడంపల్లికి చెందిన ఓ రైతుకు అద్దెకు ఇవ్వగా అతను సకాలంలో


మల్యాల సెర్ప్ కార్యాలయం వద్ద ట్రాక్టర్, యంత్ర పరికరాలు

అద్దె చెల్లించకపో వడంతో డబ్బుల కోసం మహిళ సమాఖ్య ప్రతి నిధులు, ఐకేపీ అధికారులు, రైతు మధ్య గొడవలు కూడా జరిగాయి. పోలీస్‌స్టేషన్ వరకూ గొడవ వెళ్లే క్రమంలో డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. దీంతో వాటి నిర్వహణ మండల సమాఖ్యకు తలకుమించిన భారంగా మారింది.

● భారంగా మెయింటనెన్స్..

ట్రాక్టర్ మెయింటనెన్స్ భారంగా మారుతోంది. ఏడాది క్రితం కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీ ఇతరాత్ర వ్యవసాయ పరికరా లకు అద్దె ఎడాదికి కేవలం రూ.1.20లక్షలు రాగ వాటి నిర్వహణ ఖర్చులు రూ.30వేల పైగానే అయ్యాయి. పైగా ఆ యంత్రాలు మరింత మరమ్మతులకు గురయ్యాయి. మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన వీటి డబ్బులతో ఆశించిన ప్రయోజనం రాకపోవడంతో సమాఖ్య ప్రతినిధులు ప్రభుత్వానికి మొరపె ట్టుకోవడంతో ఇటీవల రూ.10లక్షలు, యూనిట్ సబ్సిడీ కింద రూ.4లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా మండల సమా ఖ్యల సొమ్ములు తిరిగివచ్చినట్లు అయినప్పటికీ ట్రాక్టర్, వ్యవసా య యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వాటిని సద్వి నియో గం చేసుకుంటే మండల సమాఖ్యలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దీనిపై తగు చర్యలు తీసు కోవాలని పలువురు కోరుతున్నారు.

● రైతులు ఆసక్తి చూపడం లేదు

రాజయ్య, ఏపీఎం, ఐకేపీ మల్యాల

ట్రాక్టర్, ట్రాలీ ఇతర వ్యవసాయ యంత్రాలను అద్దెకు తీసుకెళ్లడా నికి రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో వాటిని తమ కార్యాలయం వద్దే ఉంచాము. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. తగిన అద్దె వస్తేనే యంత్రాలను అద్దెకు ఇవ్వాల్సి ఉంటుంది. రైతులు కూడా సద్వినియోగం చేసుకుంటే మేలుగా ఉంటుంది.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చందుర్తి, మే 19: కుటుంబ కలహాలతో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఈక శేషవ్వ (45) అనే మహిళ ఇంట్లో కుటుంబ సభ్యు లు నిద్రించిన అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహ త్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి తలుపులు పెట్టుకొని, తీయక పోయేసరికి కిటికీలో నుంచి చూడగా ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలికి భర్త రవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, మే 19: జమ్మికుంట-బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రైలు కింద పడి ఆదివారం మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నలుపు రంగు నైట్ ప్యాంట్, నీలి రంగు ఫుల్ షర్ట్, క్రీమ్ కలర్ కట్ డ్రాయర్ అంచుపైన ఎమ్ఆర్‌జి ఆర్ఈడి అని రాసి ఉంది. ఎడుమ చేయి దండ రెక్క కింద ఒక పుట్టు మచ్చ, నలుపు రంగు వెంట్రుకలు, పిల్లి గడ్డం, చామనచాయతో ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు.

లారీ, వ్యాన్ ఢీ : ఒకరి మృతి


బ్రిడ్జిపై ఎదురెదురుగా ఢీ కొన్న లారీ, వ్యాన్, రాజేశ్వర్‌రెడ్డి(ఫైల్)

కొడిమ్యాల, మే 19 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లారీ వ్యాన్ ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన దామెర రాజేశ్వర్‌రెడ్డి వ్యాన్‌లో కరీంనగర్‌లో పాలను లోడు చేసుకొని భీంగల్‌కు బయల్దేరాడు. మార్గ మధ్యలో మండలంలోని పూడూర్ గ్రామ శివారులో గల బ్రిడ్జ్ వద్ద రాత్రి (జీజే- 25-యు-9696) నెంబరు గల లారీ ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను వేగంగా ఢీకొట్టాడు. దీంతో లారీ అదుపు తప్పి వ్యాన్‌పై పడటంతో వ్యాన్ డ్రైవర్ రాజేశ్వర్‌రెడ్డి(43)కి తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందాడు. రాజేశ్వర్‌రెడ్డి భార్య దామెర వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంతో బ్రిడ్జిపై లారీ బోల్తా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొడిమ్యాల ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్థుల సహకారంతో సంఘటన స్థలంలో వాహనాలను క్రేన్‌లతో తొలిగింశారు. బ్రిడ్జ్‌పై నుంచి వాహనాలు రాక పోకలు సాగించడానికి పోలీసులు సుమారు 10 గంటలు శ్రమించారు. అనంతరం బ్రిడ్జ్‌పై నుంచి రాకపోకలు పునరుద్ధరించారు.

నాగంపేటలో వ్యక్తి అదృశ్యం


భూమాగౌడ్

గంభీరావుపేట, మే 19: గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన కోళ భూమాగౌడ్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. కోల భూమాగౌడ్ ఈనెల 15న బుధవారం గొల్లపల్లికి సామాను తీసుకొని వస్తానని ద్విచక్రవాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువులు ఎంత గాలించినా భూమగౌడ్ ఆచూకీ లభించలేదు. సమీప బంధువుల గ్రామాలకు వెళ్లి వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్లో భూమాగౌడ్ కూతురు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధం


ఈతవనంలో చెలరేగుతున్న మంటలు

కోరుట్ల రూరల్, మే 19 : మండలంలోని చిన్నమెట్‌పల్లి - వెంకటాపూర్ గ్రామల మధ్యలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధమైనట్లు గ్రామస్థులు, గౌడ సంఘ నేతలు ఆధివారం తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో రైతులు వ్యర్థాలను కాల్చడానికి ప్రయత్నిస్తున్న సమయంలో గాలికి ఆ ప్రాంతంలో ఉన్న ఈత వనంకు అంటుకున్నట్లు వారు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకరావడానికి రైతు లతో పాటు గౌడ సంఘాలు ప్రయత్నం చేసి అదుపులోకి తీసుకవచ్చారు. సుమార్ 300 వరకు ఈత చెట్లు దగ్ధం అయినట్లు గ్రామస్థులు తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా పల్లవోత్సవం, వసంతోత్సవం


వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మపురి, మే 19: ధర్మపురి నరసింహ నవరాత్రోత్సవాలు ఏడవ రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఉదయం ఆలయ వేదపండి తులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడ షోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యసూక్త, రుద్రాభిషేకం, పంచోపనిషత్తులచే విశేష పూజలు, సప్త హారతులు, మహా నివేదన, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. గోధూళి సుమూహూర్తమున అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠ పైకి తీసుక వచ్చి ఆశీనులు చేశారు. అనంతరం పంచోపనిషత్తుల పారాయణ పూర్వకం గా వేద మంత్రాలు పఠించారు. పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దూర్ శివారులో ఇసుక డంప్‌లు


ఇసుకడంప్

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూరు శివారులోని అపెరల్ పార్కు ప్రాంతంలో ఇసుక డంప్ చేశారు. సిరిసిల్లలో ఇసుక రవాణాకు పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు అంక్షలు విధించడంతో ఇసుక దొరకడం కష్టంగా మారింది. ఇసుకకు డిమాండ్ ఉండడంతో పెద్దూర్, సర్ధాపూర్‌కు చెందిన కొంత మంది ఇసుక స్మగ్లర్లు ఆదివారం గ్రామ శివారులో డంప్ చేసి రాత్రిపూట లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామ శివారులో ఉన్న ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ కళాశాల పనులను అడ్డుకున్న రైతులు

● నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే నిర్మాణం చేపట్టాలి ● హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలు దహనం


భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న రైతులు


మెడికల్ కళాశాల వద్ద హద్దుకర్రలను దహనం చేస్తున్న రైతులు

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణాలను రైతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అడ్డుకున్నారు. నూతన భవనాల నిర్మాణాల హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తీసి రైతులు దహనం చేశారు. పెద్దూర్ శివారు లోని సర్వేనంబర్ 408లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను గతంలో జీవనోపాధికోసం భూములు లేని వారికి అప్పటి ప్రభుత్వాలు అందించాయి. ఆ భూములపై అధారపడి జీవిస్తున్న రైతులకు గత ప్రభు త్వం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో అప్పటి మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్ సదురు భూములకు చెందిన రైతులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి మరో చోట వాణిజ్య పరమైన భూములను అందిస్తామని హామీ ఇచ్చి మెడికల్ కళాశాల కోసం 40 మంది రైతులకు చెందిన 36 ఎకరాలను తీసుకున్నారు. వెంటనే అందులో మెడికల్ కళాశాలను నిర్మించి ప్రారంభించారు. నష్టపరిహారంతో పాటు ఇచ్చిన హామీ ప్రకారం భూము లను ఇవ్వాలంటూ రైతులు అధికారుల చుట్టుతిరిగినా ఎలాంటి స్పందన లేకపోవడంతో మిగతా భూముల్లో నిర్మాణాలను అడ్డుకోవాలని రైతులు నిర్ణయించారు. అయితే గత నెల ఏప్రిల్ నెలలో అదనపు భవనాల నిర్మాణా లను చేసేందుకు కాంట్రాక్టర్ రావడంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని నిర్మాణాలను అపాలంటూ వారం రోజుల పాటు రైతులు అందోళనలు చేపట్టారు. దీంతో కలెక్టర్ స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోను అదేశించారు. ఆర్డీవో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అదే ప్రాంతంలో ఉన్న భూములను రైతులతో కలిసి ఆర్డీవో రమేష్ పరిశీలించి అందులో భూములను అందిస్తామని హామీ ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదు. భవనాలను నిర్మించేందుకు కాంట్రాక్టర్ అదివారం అక్కడి చేరుకుని నాగుల లక్ష్మికి చెందిన భూమిలో హద్దులను ఏర్పాటు చేయడంపాటు నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని వేయడంతో ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని హద్దులను వేయకుండా అడ్డుకున్నారు. హద్దుల కోసం ఏర్పాటు చేసిన కర్రలను తొలగించి అక్కడే దహనం చేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఉలిసే తిరుపతి, నాగుల లక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బీర్‌పూర్,మే 19:బీర్‌పూర్ మండలంలోని నర్సింహుల పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి 14 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన కోట సంతోష్ అనే వ్యక్తి నర్సింహులపల్లి గ్రామంలో అక్రమం గా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తరలించడానికి సిద్ధంగా ఉన్నడన్న పక్క సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి 14 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరివెంట ఏఎస్సై గజేందర్, కానిస్టేబుళ్ళు ముత్తయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



సదస్సులో ప్రసంగిస్తున్న అధ్యాపకుడు మల్లేశం

హుజూరాబాద్‌రూరల్, మే 19: మండలంలోని సింగా పూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడి గా పనిచేస్తున్న లింగబత్తిని మల్లేశం అంతర్జాతీయ సదస్సుకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమకు మార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 17,18వ తేదీలో జరిగిన అంతర్జాతీయ సదస్సు లో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు చేస్తున్న సామాజిక సేవపై మాట్లాడి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీ య సదస్సుకు ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యాపకు లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంకర దారిపై కష్టాలెన్నో?


రోడ్డుపై కంకర

ఎల్లారెడ్డిపేట, మే 19: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట నుంచి గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట వరకు రహదారి పనులు కొనసాగుతున్నాయి. రూ 1.90కోట్ల నిధులతో తలపెట్టిన పనులు ఏడు నెలలుగా సాగుతూనే ఉన్నాయి. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర రహదారిపై ప్రయాణించే వారు జల పైలం మరి.

ఘనంగా కొండస్వామి బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 19 : మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా బండలింగాపూర్ సంస్థాన్ నుంచి జగ్గసాగర్ ఆలయంలోని ఉత్సవ మూర్తులను తీసుకరావడం అనవాయితీగా వస్తోంది. ఉత్సవమూర్తులను డప్పు చప్పుల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఏర్పాటు చేసి శోభయాత్రగా గ్రామంలోని కొండస్వామి ఆలయానికి గంగపుత్రులు తీసుకొ చ్చారు. ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసిన పురోహితులు అభిషేకాలు, అర్చనలు అలంకరణ, పూజలు, హారతి కార్యక్రమాలను జరిపారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గంగపుత్రులు, భక్తులు పాల్గొన్నారు.


ఊరేగింపుగా ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న గంగపుత్రులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

మానకొండూర్, మే 19 : మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన భారతి కనకవ్వ అనే మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు స్థానిక సీఐ తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లింగాపూర్‌కు చెందిన కనకవ్వకు జ్వరం రావడంతో అదే గ్రామానికి చెందిన మమత అనే ఆర్ఎంపీ వైద్యురాలు వేసిన ఇంజ క్షన్ వికటించి తీవ్ర అస్వస్థతకు గురి అయిందని తెలిపా రు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిం దని సీఐ తెలిపారు.

పెళ్లి కాలేదని చెప్పి రెండో వివాహం

● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు ● నిందితుడిపై కేసు

కరీంనగర్ క్రైం, మే 19 : తనకు తల్లిదండ్రులు లేరని, పెళ్లి కాలేదని అబద్ధాలు చెప్పి మొదటి భార్య ఉండగానే మళ్లీ వివాహం చేసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌కు చెందిన యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నది. ఆమె తండ్రి మరణించగా సోదరుడు ఆమెకు వివాహ సంబంధాల కోసం 2021లో వావిలా లపల్లిలోని మ్యారేజ్‌బ్యూరోలో సంప్రదించాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక సంబంధం వచ్చినట్లు, అబ్బాయి వివరాలను మ్యారేజిబ్యూరో నిర్వాహకులు బాధితరాలుకు ఇచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న రాంనగర్‌లోని ముషీరాబాద్‌కు చెందిన సీహెచ్ వెంకట రాఘవేంద్రరావుతో సంప్రదింపులు జరపగా అతనికి వివాహం కాలేదని, తల్లిదండ్రులు లేరని చెప్పాడు. ఇద్దరు పరస్పరం ఇష్టప డ్డారు. ఈ మేరకు వెంకటరాఘవేంద్రరావు, అతని పిన్నిగా సత్యవతి అనే మహిళతో వచ్చి 2021 ఆగస్టు 25న కరీంనగర్‌లో వరపూజ చేసుకున్నారు. అదే సమయంలో 5 లక్షల నగదు, 2 తులాల బంగారనం వరకట్నం ఒప్పుకుని 50 వేల రూపాయలు ముట్ట జెప్పారు. పెళ్లికి ఎవరినీ ఆహ్వానించవద్దని వెంకటరాఘవేంద్ర కోరగా కుటుంబ సభ్యుల సమక్షంలోనే 2022 జూన్ 26న ఎల్ఎండీ లక్ష్మినర్సింహస్వామి దేవాలయంలో ఇద్దరు వివాహం చేసుకున్నారు. పెళ్లి అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి రాంనగర్ ప్రాంతంలో గది అద్దెకు తీసుకుని ఉన్నారు. వారానికి రెండు మూడు రోజులు ఇంటి వద్ద ఉండి ఆఫీస్ పనిఉందని మిగతా రోజులు ఇంటికి వచ్చేవాడు కాదు. అనుమానం వచ్చి ఆరాతీ యగా ఉద్యోగం చేస్తున్న విషయం నిజమేనని వెల్లడైంది. వెంకటరాఘవేంద్ర ఆధార్‌కా ర్డు చిరునామా ఆధారంగా అతని ఇంటికి వెళ్లగా అతని ఇంటిలో తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, మొదటి భార్య ఉన్నారు. దీనిపై వెంకటరాఘవేంద్ర నిలదీయగా కులం పేరుతో దూషించి, చేతులతో కొట్టి బెదిరించాడని బాధితురాలు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పంటపొలాల్లో అగ్ని ప్రమాదం

గంగాధర, మే 19: గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ శివారులో కోసిన వరిపొలంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. పశుగ్రాసం, పొలాలకు నీటి సరఫరా కోసం వేసిన పైపులు, విద్యుత్ వైర్లు కాలిబూడిదయ్యాయి. మం టలకు గాలి తోడవడంతో ఒక్కసారి వ్యాపించాయి. నాగిరెడ్డిపూర్‌కు చెందిన సిరికొండ మధు పొలంలో పర దాల్లో కుప్పపోసిన ధాన్యం, నాలుగు పరదాలు కాలి పోయినట్లు తెలిపారు. ఈ ఘటనలో సుమారుగా లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మంటలు అంటుకున్న సమయంలో రైతులు వాటిని ఆర్పేందుకు కరెంటు మోటార్లను ఆన్ చేశారు. అయితే అదే సమయం లో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు జరపడానికి కరెం టు నిలిపివేశారు. విద్యుత్ ఉంటే ప్రమాద తీవ్రత ఇంత ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు

కోనరావుపేట, మే 19: కొన్ని సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ వరద తాకిడికి కూలిపోయింది. సుమా రు ఏడు సంవత్సరాలు గడిచినా నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ ఏడు సంవత్సరాల క్రితం భారీ వర్షాల వల్ల వచ్చిన వరద తాకిడికి కూలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడంతో పశువులు లోపలికి వెళ్లి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. అంతే కాకుండా ప్రహరీ లేకపోవడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారు లు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.



కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ, మే 19: గోదావరిఖనిలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శారదానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకుక విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ దేవస్వామి తెలిపారు. శారదానగర్ ఫీడర్ పరిధిలోని పవర్‌హౌస్‌కాలనీ, బస్టాండ్‌కాలనీ, సప్తగిరికాలనీ, ఐబీకాలనీ, రాజ్యలక్ష్మికాలనీ, బాపూజీనగర్, అక్షర ప్లాట్స్‌ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు తెలిపారు.

అల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో..

ఫైెటింక్లయిన్‌కాలనీ, మే 19: అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఏరియాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ హరీష్ తెలిపారు. 11 కేవీ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. అల్లూరు, రాజీవ్‌నగర్‌తండా, న్యూమారేడుపాక ప్రాంతాల ప్రజలు విద్యుత్ అంతరాయం ఉండనున్నదని ఏఈ హరీష్ తెలిపారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు

ముత్తారం, మే 19 : మండల ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చింతం శ్రీకాంత్ తెలిపారు. ముత్తారం మండలంనకు 330క్వింటాల్ జీలుగ విత్తనాలు అలాట్ కాగా ప్రస్తుతం 170 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సంప్రదించాలని, బస్తా ధర రూ.1116 ఉందన్నారు.

నేత్రదానం

కళ్యాణ్‌నగర్, మే 19: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన భైసా లలిత బాయ్(48) ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. స్థానిక ఊర్వశి థియేటర్ సమీపంలో నివాసముండే లాలితాబాయ్ ఆదివారం గుండెపోటుతో అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రసాద్ ద్వారా లాలితాబాయ్ నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేసి ఇద్దరికి వెలుగులు ప్రసాదించిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, భీష్మాచారి, కే.ఎస్.వాసు,ఆరపెల్లి రాజమౌళి అభినందించారు.

అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గం చేయాలి

భగత్‌నగర్, మే 19: జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతంచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రమేష్‌లు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో గుర్తింపులేని పాఠశాలల పేర్లు బహిర్గం చేయకుండా గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే పిల్లల్ని చదివించాలని ప్రకటించిన డీఈవో ప్రకటన సరైంది కాదన్నారు. జిల్లాలో అనుమతి లేని పాఠశాలల పేర్లు ప్రకటించాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, మే 19: కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని కొత్తపల్లి వైస్‌ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం చింతకుంటలోని ధాన్యం కొనగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ చాంద్‌పాషా, పైడిపాల సతీష్‌సోమిరెడ్డి లచ్చిరెడ్డి, బోనాల శంకర్, కట్కూరి మల్లేశం, గజ్జల సాగర్, సయ్యద్ సలీం, రవీందర్‌రెడ్డి, మారుతి, శశిధర్, లక్ష్మణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీంనగర్ టౌన్, మే 19: చిన్నపుడు కలిసి చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలుసుకొని ఆత్మీయ పలుకరిపులతో పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఆదివారం నగరంలోని కాపువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదవ తరగతి చదివిన విద్యార్థులు నగరంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. కాంగ్రెస్‌నాయకుడు మాదాసు శ్రీనివాస్, కలిగిరి నాగరాజు, ఎస్ఐ శంకర్, జూనియర్ అసిస్టెంట్ కనుకయ్య, ఎస్ఐ శరత్, బీఎస్ఎన్ఎల్, వెంకటాచారి, ట్రాన్స్‌కో ఉద్యోగి కిష్టయ్య, సీనియర్ అసిస్టెంట్ రవీంద్ర, ఎస్ఐ విద్యాసాగర్, వ్యాపారి దశరథం తదితరులు చాలా రోజుల తర్వాత కలుసుకొని విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆ తర్వాత ఎవరు ఎక్కడ స్థిరపడ్డారు, కుటుంబ నేపథ్యం, ప్రస్తుత ఆరోగ్య, ఆర్థిక పరిస్తుతులు చర్చించుకొని ఆటపాటలతో, ఆనందోత్సాహాలతో తరచూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించుకొని ఆరోగ్యంగా, ఒకరికొకరం తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు


కాలనీలో సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, మే 19: అంటరానితనం నిర్మూలన, పేద ప్రజల హక్కుల సాధన కోసం కృషి చేసిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా గోదావరిఖని మెయిన్ చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపాడని, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికై సైకిల్ మీదనే చట్ట సభలకు వెళ్లి ప్రజల సమస్యలను వినిపించిన మహానాయకుడు సుందరయ్య అన్నారు. అనుమాల మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెండె శ్రీనివాస్, వేల్పుల కుమారస్వామి, నర్సన్న, నాగమణి, షైముదా, ఓదెలు, సాగర్, పీర్‌మహ్మద్, జన్న కొమురయ్య పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : ఆర్జీ-2 సీఐటీయూ ఆఫీస్‌లో ఆదివారం డివిజన్ అధ్యక్షుడు వెంకన్న అధ్యక్షతన పుచ్చపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి మాట్లాడారు. సుందరయ్య ఆదర్శవంతమైన మ్యూనిస్టు అని, చిన్నతనం నుండి ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నట్టు తెలిపారు. నేటి రాజకీయ నాయకులు సుందరయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాలకు, సైద్ధాంతిక బావజాలం విస్తరించడంలో సుందరయ్య పాత్ర విశేషమైనదని అన్నారు. ఈకార్యక్రమంలో కుంట ప్రవీణ్, వినయ్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగిరి : దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం ఆర్జీ-3 డివిజన్‌లోని సెంటినరీకాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పీడిత ప్రజలకు అండగా నిలిచారని కొనియాడుతూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దొమ్మెటి కొంరయ్య, నాయకులు భూస్వామ్యరెడ్డి, ఎండి హమెూద్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వేణుగోపాల్, రాజలింగయ్య, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : పుచ్చపల్లి సుందరయ్య స్ఫూర్తితోనే సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి మండల కేంద్రం బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జెండాను ఆవిష్కరించారు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితాంతం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం దోపిడి వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేశారన్నారు. చదువుతున్న రోజుల్లోనే స్వాతంత్రోద్యమంలో పాలొని జైలుకు వెళ్లారని, అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని అన్నారు. భారత తొలి పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారని ప్రజసమస్యలపై పోరాటాలు, రైతాంగ సాయుధ పోరాటం, పార్లమెంటరీ రంగంలో పోరాటాలు నిర్వహించారని, తన యావదాస్తిని పేదలకు పంచారని, పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్ మీద వెళ్లిన ఆదర్శ నాయకుడు సుందరయ్య అని అన్నారు, సీపీఎం తొలి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, పెట్టుబడిదారీ దోపిడి సమాజాన్ని నిర్మూలించి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించే సమ సమాజం కోసం కృషి చేశారని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలందరినీ సమీకరించి పోరాటాలు నిర్వహించడమే సుందరయ్యకు అర్పించే నిజమైన నివాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మంద రాజేందర్, ప్రజాసంఘాల నాయకులు అంబాల లక్ష్మణ్, చెప్యాలా మహేష్, నాల కొమురయ్య, అంజయ్య లక్ష్మీనర్సు లతా, లక్ష్మణ్, సది, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సెంటినరీకాలనీలో నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


కాల్వశ్రీరాంపూర్‌లో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మంథనిరూరల్, మే 19: మండలంలోని కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవాన్ని వేద పండితులు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభించారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసిన అనంతరం కల్యాణోత్సవ వేడుకలను వేదోక్తంగా ప్రారంభించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై వేదోక్తంగా శ్రీభూనీల సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈనెల 23వ తేది వరకు ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ముస్కుల సురేందర్‌రెడ్డి, శశిభూషన్‌కాచే, మాజీ సర్పంచ్ చిదురాల మంగ-దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ మిర్యాల ప్రసాద్‌రావు, గ్రంథాలయ డైరెక్టర్ గుడిసె గట్టయ్య, తోకల మల్లేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఎలిగేడు : మండలంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వేదమంత్రాల మధ్య పూజారులు నిర్వహించారు. ఈనెల 10నుంచి 25వరకు వివిధ హోమాలు పూజ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. మృత్తాంగ్రహనం, అంకూరార్పణం, గరుడ, ధ్వజపటాది, వాసాది హోమం, ప్రాబోధకి సాయంత్రం, ధ్వజారోహణం, తిరుక్కళ్యాణం తదితర పూజా కార్యక్రమాల అనంతరం వేదబ్రాహ్మణలుతో కళ్యాణ మహోత్సం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రమాదం 'అంచున' ప్రయాణం

- మట్టల వాగు బ్రిడ్జిపై తరచూ ప్రమాదాలు


ప్రమాదకరంగా తయారైన మట్టలవాగు బ్రిడ్జి

కాల్వశ్రీరాంపూర్, మే 19: మండలంలోని పెద్దరాతుపల్లి, ఇదిలాపూర్ గ్రామాల మధ్య ఉన్న మట్టల వాగు బ్రిడ్జిపై సైడ్ దిమ్మలు లేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలం నుంచి బేగంపేట, గోదావరిఖని, ఇదిలాపూర్, ముత్తారం, మీదుగా మంథని, కాటారం కాళేశ్వరం ప్రతిరోజు వాహనాలు పోతుంటాయి. ఈ బ్రిడ్జిపై వంతెన నిర్మించి సైడ్ దిమ్మలు సరిగా నిర్మించని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. 40 సంవత్సరాల క్రితం ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ఈ బ్రిడ్జి కూడా ఇరుకుగా ఉంది. రాత్రి సమయంలో వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు లైట్ల వెలుగులకు సైడ్ దిమ్మలేని కారణంగా వాహనాలు మరొక వాహనం పక్క నుంచే పోయే తరుణంలో అదుపుతప్పి పడిపోతున్నాయి. గతంలో ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వస్తున్న లారీని తప్పించేక్రమంలో మట్టిలవాగు కిందపడి గాయాలపాలయ్యారు. ధాన్యం లోడుతో వెళుతున్న లారీ కూడా అదుపుతప్పి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ముత్తారం మండలం నుంచి జమ్మికుంటకు ఇటీవల పత్తి వ్యాను కూడా ఈ ప్రాంతంలో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రాత్రి సమయంలో వాహనాలు కూడా ఢీకొన్న సంఘటనలు ఉన్నాయని పెద్దరాతుపల్లి గ్రామస్తులు తెలిపారు. గతంలో ఇటీవల ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాజు ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి మట్టల వాగు బ్రిడ్జి పైనుంచి ఆటో కింద పడడంతో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రతిరోజు గోదావరిఖని నుంచి బేగంపేట, కాల్వశ్రీరాంపూర్ ద్వారా జమ్మికుంటకు బస్సు నడుస్తోంది. మట్టిలవాగు బ్రిడ్జి ఇరుకుగా ఉన్న కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీసీ డ్రైవర్ పేర్కొంటున్నారు. మట్టల వాగు బ్రిడ్జికి ఎదురుగా వాహనం వస్తే ఆ వాహనం బ్రిడ్జి దాటే వరకు బస్సు నిలపవలసి వస్తుందని ఆర్టీసీ డ్రైవర్లు, ఇతర వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా సైడ్ దిమ్మలు ఎత్తుగా కట్టడం వలన ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై నుంచి కాల్వ శ్రీరాంపూర్, జమ్మికుంట, పొత్కపల్లి తదితర ప్రాంతాలకు నిత్యం వాహనాల ద్వారా వారి పనుల నిమిత్తం ప్రజలు వస్తూపోతుంటారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ బ్రిడ్జిపై దిమ్మలను నిర్మించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు


క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

ఓదెల, మే 19 : తెలంగాణలోని శైవ క్షేత్రాల్లో ఒకటైన ఓదెల మల్లన్న ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భానుడు శాంతించడంతో వరంగల్, భూపాలపల్లి, మంచిర్యాల, సిద్దిపేట్ జిల్లాల నుంచి భక్తులు దర్శనానికి అధికంగా తరలివచ్చారు. జాతరలో భక్తుల రద్దీ పెరగడంతో పట్నాలు వేయించేందుకు ఒగ్గు పూజారులే సరిపోలేదు. దీంతో క్రమపద్ధతిలో ఒగ్గు పూజారులు ఆలస్యంగానైనా పట్నాలు వేశారు. అలాగే భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు క్యూ లైన్‌లలో రెండు గంటలపాటు వేచి ఉన్నారు. అలాగే మల్లన్నకు బోనాలు, కోడెల మొక్కలు, ప్రదక్షిణలు, పట్నాలు వేయించి, మదనపోచమ్మ, బంగారు పోచమ్మ, రామాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. వాహనాలకు పార్కింగ్ స్థలంలేకపోవడం వల్ల భక్తులు వంటలు చేసుకునే వద్దనే తమ వాహనాలను నిలుపుకోవాల్సి వచ్చింది.

ఇంజనీర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి


జీఎంకు వినతిపత్రం అందిస్తున్న అధికారులు

రామగిరి, మే 19: సింగరేణి ఇంజనీర్ కిరీటి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఎంవోఏ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లలకు అధికారులు చేసిన సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కిరీటి మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

మంథని, మే 19: అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్న దృష్ట్యా కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. వెంట బీజేపీ నేతలు పోతరవేన కాంత్రికుమార్, రాపర్తి సంతోష్, సబ్బని సంతోష్, నారమల్ల కృష్ణలు పాల్గొన్నారు.

ఖనిలో కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

కోల్‌సిటీటౌన్, మే 19: ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని దుర్గానగర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దెల దినేష్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయగా కళాకారులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గోదావరిఖని ప్రాంతం కళలకు, కళాకారులకు పురుటిగడ్డ అని, ఎన్నో ఉద్యమాలకు కళలలే ముందుడి నడిపాయని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి, అరుణోదయ, కళా సంఘాల సమాఖ్య, సింగరేణి కళాకారుల ఐక్య వేదిక, సారథి సంఘాల తరుపున పాత, కొత్తతరం కళాకారులు ఈ వేడుకలో పాల్గొని కళ గొప్పతనాన్ని కొనియాడారు. ఈకార్యక్రమంలో కె.స్వామి, మేజిక్‌రాజా, రంగ జ్యోతి, ఈపద్మ, అప్పాల పోచం, సామల రాజన్న, డిశంకర్, జక్కని శ్రీలత, రాము, రెవల్లి గీత, కొప్పుల రాజనర్సు, కాసిపాక రాజమౌళి, సతీష్‌కుమార్, మోహన్, రాజమౌళి, కొమ్ము చందు, ఆరెపల్లి మానస్‌కుమార్, ప్రసాద్, నరేందర్ పాల్గొన్నారు.

విద్యాసాగర్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న విద్యాసాగర్

మంథని, మే 19: గోసేవ, సామాజిక సేవా రంగాల్లో కృషి చేస్తున్న మంథనికి చెందిన ఆకుల విద్యాసాగర్‌కు మహా మయూర ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. ఏఎన్ఎస్24 టీవీ, ఎస్ఎస్ఆర్‌కే అకాడమీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ వేలు ఆనందచారి చేతల మీదుగా ఆకుల విద్యాసారగ్ మహా మయురా ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. తకు అవార్డును అందించిన సంస్థలకు విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆకుల అవార్డు అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ల్యాప్‌టాప్ అప్పగింత

పెద్దపల్లిటౌన్, మే 19: బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను ఆదివారం మహానీయుల ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం బాధితుడికి అప్పగించాడు. శనివారం అర్ధరాత్రి చంద్రాపూర్ నుంచి పెద్దపల్లి వస్తున్న బస్‌లో రామకృష్ణపూర్‌కు చెందిన నాగుల్లమల్యాల రోహిత్ ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్ మర్చిపోయాడు. బ్యాగు దొరికిన బొంకూరి కైలాసం ఆదివారం రోహిత్‌కు సమాచారం అందించి అప్పగించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కాల్వశ్రీరాంపూర్, మే 19: రైతులకు వానాకాలానికి పచ్చి రొట్టె ఎరువులు అయిన జీలుగ విత్తనాలు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు 167బస్తాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నాగార్జున తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో కాల్వ శ్రీరాంపూర్ ఆగ్రోస్, డీసీఎంఎస్ పెగడపల్లి ఆగ్రోస్ నందు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఒక బస్తా పూర్తి ధర రూ.2,790, సబ్సిడీ రూ.1,674, రైతు చెల్లించవలసిన మొత్తం రూ.1116. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు తీసుకొని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు సంప్రదించాలని సూచించారు. 30 కేజీలు బస్తా 2.2 ఎకరాలకు సరిపోతుందని వ్యవసాయ అధికారి తెలిపారు.

మంగపేట వాసికి డాక్టరేట్



కాల్వశ్రీరాంపూర్, మే 19: మంగపేటకు చెందిన పూదరి ప్రభాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ, వాణిజ్య విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, మాజీ వైస్ ఛాన్సలర్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కేరళ లేట్ ప్రొఫెసర్ హెచ్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ప్రొటెం సూపర్‌వైజర్ పర్యవేక్షణలో 'ఇవాల్యు యేషన్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషనల్ ఫైనాన్స్ ఫర్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ స్టేట్-ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ విభాగం వారు మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన పూదరి ప్రభాకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. గ్రామీణ వ్యవసాయ కుటుంబ నేపథ్యంతో వచ్చిన పూదరి ప్రభాకర్ చిన్నతనం నుండే విద్యలో ప్రతిభ చూపిస్తు ప్రాథమిక విద్యను మంగపేట ప్రభుత్వ పాఠశాలలో, కాకతీయ యూనివర్సిటీ నుండి ఉన్నత విద్యలో డబుల్ పీజీ, ఎంబీఏ, ఎంకామ్ పూర్తి చేసి, రెండింటి యూజీసీ నెట్, టీఎస్ సెట్ సాధించాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, 12నేషనల్, ఇంటర్నేషనల్ ఆర్టికల్స్‌ను ప్రచురణ చేశారు.

బాధిత కుటుంబానికి పరిహారం

పాలకుర్తి, ఆదివారం 19: బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చేందుకు ఆదివారం ఒప్పందం కుదిరింది. మండల పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన కోడిపుంజుల రాజు గోపు ఐలయ్య టిప్పర్ లారీపై డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తు మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఐలయ్య మృతుడి కుటుంబానికి 18 లక్షల రూపాయల నష్టపరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకొని డబ్బులు ఇవ్వడంలో అశ్రద్ధ వహించాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను ఆశ్రయించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, కేశోరాం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు ఐదు రోజుల నుండి ఐలయ్యకు సంబంధించిన టిప్పర్ లారీలను అడ్డుకొని నిరసనలు తెలిపారు. దీంతో ఐలయ్యరాజు కుటుంబ సభ్యులకు గతంలో ఇచ్చిన 7లక్షలతో పాటు మరో 8 లక్షలు రాజు కుటుంబాని ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత 5 రోజుల నుండి చేసిన ఆందోళన ముగిసింది.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలి'

కమాన్‌పూర్, మే 19 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌లను ప్రభుత్వం పెంచాలని పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లబెల్లి శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దన్నారు. ముందు బీసీ లెక్కలు తేల్చాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోకూడదన్నారు. ఎన్నికల వేళ బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చాలన్నారు.

కళాకారుడు మేజిక్‌రాజాకు సత్కారం


మేజిక్‌రాజాను సత్కరిస్తున్న ఫైట్ ఫర్ బేటర్ సొసైటీ సంస్థ

కోల్‌సిటీటౌన్, మే 19: ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కళాకారుల ఆత్మీయ సమ్మేళనంలో కళాకారుడు మేజిక్ రాజాను ఘనంగా సత్కరించారు. కళారంగంలో మేజిక్ కళాకారుడిగా, వ్యాఖ్యాతగా, నటుడిగా సేవలందిస్తున్నందుగాను మేజిక్ రాజాను శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దెల దినేష్, ఇప్టాజాతీయ సమితి సభ్యులు కె స్వామి, కన్నం లక్ష్మీనారాయణ, దామెర శంకర్, దయానర్సింగ్, డాక్టర్ రంగ జ్యోతి, కాసిపాక రాజమౌళి, ఈదునూరి పద్మ, సోగాల వెంకటి తదితరులు పాల్గొన్నారు.